క్లుప్తంగా

ఉపాధి పనులు కల్పిస్తాం



ఉపాధి పనులపై సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి

నందికొట్కూరు: జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తామని జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది ఎక్కువ మందికి ఉపాధి పనులు కల్పించాలని లక్ష్యం నిర్దేశించుకున్నామన్నారు. ఆ దిశగా సిబ్బంది కృషి చేసి ప్రతి నెలా ప్రోగ్రెస్ చూపించాలని ఆదేశించారు. పండ్ల తోటల పెంపకానికి రైతులను ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సుబ్రమణ్యం, ఏపీడీ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

నందికొట్కూరు: విద్యారంగ సమస్యలపై పీడీఎస్‌యూ నిరంతర పోరాటం చేస్తోందని యూనియన్ జిల్లా నాయకులు నవీన్ తెలిపారు. శుక్రవారం యూనియన్ 50 వసంతాల సంబరాల వాల్‌పోస్టర్‌ను ప్రైవేట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురహరి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు కిరణ్, వాసు, హరి పాల్గొన్నారు.

కొయ్యలు కాల్చొద్దు

వెలుగోడు: పంట కోత అనంతరం కొయ్యలు కాల్చొద్దని ఏవో పవన్ కుమార్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని గుంతకందాల, అబ్దుల్లాపురం గ్రామాల పరిధిలో మొక్కజొన్న, మినుము పొలాలను ఆయన శుక్రవారం సిబ్బందితో కలిసి పరిశీలించారు. పొలాల్లో కొయ్యలను కాల్చుతుండటం గమనించి రైతులను వారించారు. పొలాన్ని కలియ దున్నితేనే పంటలకు మేలు జరుగుతుందన్నారు.

కేసీలో గుర్తుతెలియని మృతదేహం

జూపాడుబంగ్లా: కర్నూలు-కడప కాల్వలో శుక్రవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. తాటిపాడు, భాస్కరాపురం, ప్రాతకోటకు చెందిన పలువురు పొలానికి వెళ్తూ ఎగువ నుంచి నీటిలో కొట్టుకొస్తున్న మృతదేహాన్ని చూసి భయపడ్డారు. మృతదేహంపై నల్లని ప్యాంటు, మెరూన్‌రెడ్ కలర్ షర్టు ఉన్నాయి. మృతుని వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండవచ్చు. శవం బాగా ఉబ్బి దుర్వాసన కొడుతుండటంతో నాలుగు, ఐదు రోజుల క్రితం చనిపోయినట్లు తెలుస్తోంది. మృతున్ని ఎవ్వరైనా చంపి కేసీ కాల్వలో వేశారా లేక కాలుజారి కాల్వలో పడి మృతిచెందాడా అనే విషయాలు తెలియాల్సి ఉంది. అందరూ చూస్తుండగానే మృతదేహం కాల్వలో దిగువకు కొట్టుకుపోయింది.

యువకుల మధ్య ఘర్షణ

మహానంది: ఈశ్వర్‌నగర్ కాలనీ శివారులో ఉన్న నంద్యాల టోల్‌గేట్ వద్ద రెండు వర్గాలకు చెందిన యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించారు. దీంతో ఓ వర్గానికి చెందిన యువకులు పరారవగా, మరో వర్గానికి చెందిన కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించాలి

- డీఎస్పీ రామాంజినాయక్

పాములపాడు: పిల్లల భవిష్యత్ గురించి ప్రతి తల్లీదండ్రీ ఆలోచించాలని డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. శుక్రవారం రాత్రి మండలంలోని ఎర్రగూడూరులో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ భూతగాదాలు, ఆస్తి పంపకాలు, అక్రమ సంబంధాలు గొడవలకు దారి తీస్తాయన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే పోలీసుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. పిల్లలకు ఎక్కువగా సెల్‌ఫోన్ ఇవ్వొద్దని, బాల్య వివాహాలు చేయొద్దని, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ సురేష్‌బాబు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి



మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యా శంకర్ నాయక్

మహానంది: గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం రాత్రి మహానందికి వచ్చిన ఆయనకు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి స్వాగతం పలికారు. అనంతరం కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని పూజలు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో వేద పండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. ఆయన వెంట జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్, గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి రవినాయక్, నాయకులు నగేష్ నాయక్, ఈశ్వర్‌నాయక్, స్వామినాయక్, హనుమంతు నాయక్, సుంకన్న ఉన్నారు.

లోలెవెల్ బ్రిడ్జీలు .. హైలెవెల్ కష్టాలు

వర్షాకాలం వస్తే పొంగిపొర్లే వాగులతో ప్రజల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. వాగులపై లోలెవెల్ వంతెనలు ఉండటంతో కాస్త పెద్ద వర్షం వచ్చిన ప్రతిసారీ వాటిపైకెక్కి నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్తంభించిపోతున్నాయి. అత్యవసర సమయాల్లో వాగు దాటే క్రమంలో ప్రజలు ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ ఉన్నాయి. అయినా ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదు. – మిడుతూరు

- మిడుతూరు మండల ప్రజలకు కాకిలేరు, కుందూ వాగుల భయం
- వర్షాకాలంలో పొంగిపొర్లుతున్న వైనం
- గతంలో ఓ వ్యక్తి గల్లంతై మృతి
- పట్టించుకోని అధికారులు



తలముడిపి వద్ద కుందూ వాగు ఉధృతి (ఫైల్)



రహదారిపై భారీగా నిలిచిపోయిన వాహనాలు (ఫైల్)



చెరుకుచెర్ల - బైరాపురం గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి

మిడుతూరు విద్యుత్ ఉపకేంద్రం వద్ద కాకిలేరు, తలముడిపి వద్ద కుందూ వాగు వర్షాకాలంలో ప్రజలను భయపెడుతున్నాయి. కాకిలేరు, కుందూ వాగుల వద్ద గతంలో లోలెవెల్ వంతెనలు నిర్మించారు. అయితే అవి ఆర్‌అండ్‌బీ రహదారి కంటే తక్కువ ఎత్తులో ఉండటంతో వాగులు పొంగిపొర్లిన సమయంలో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతాయి. మిడుతూరు నుంచి ఓర్వకల్లు వెళ్లే రహదారిలో మిడుతూరు – చింతలపల్లి గ్రామాల మధ్య కాకిలేరు, చింతలపల్లి – ఖాజీపేట గ్రామాల మధ్య కుందూ వాగు, మిడుతూరు – గార్గేయపురం వెళ్లే రహదారిలో మిడుతూరు – పీరుసాహెబ్ పేట, చెరుకుచెర్ల – బైరాపురం గ్రామాల మధ్య కాకిలేరు ఉధృతంగా ప్రవహిస్తుంది. గతంలో చెరుకుచెర్ల – బైరాపురం గ్రామాల మధ్య కాకిలేరు ఉధృతికి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. అలాగే అలగనూరు గ్రామం వద్ద పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో పీతిరి వాగు ప్రవాహంలో చిక్కుకున్న ఘటన, చింతలపల్లి ఖాజీపేట గ్రామాల మధ్య గతంలో కుందూ వాగు ఉధృతి కారణంగా పాఠశాల నుంచి ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో విద్యార్థులు నీటి ప్రవాహంలో చిక్కుకున్నారు. ఇలాంటి ఘటనలు చాలానే ఉన్నాయి. ఇంత తీవ్ర ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారులు మాత్రం ఏటా వర్షాకాలంలో వాగులు ఉధృతంగా ప్రవహించే ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసు సిబ్బందిని కాపలా ఉంచి, వాహనాల రాకపోకలను నిలిపివేసి చేతులు దులుపుకుంటున్నారే కానీ శాశ్వత పరిష్కారం చూడం లేదు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారులు స్పందించి లోలెవెల్ (వంతెనలు) గుర్తించి.. ఆ ప్రదేశాల్లో హైలెవెల్ వంతెనల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వంతెనల ఏర్పాటుకు చర్యలు

నందికొట్కూరు – నంద్యాల ప్రధాన రహదారిపై కుందూ, కాకిలేరు వాగుల ప్రవాహ ఉధృతిని గుర్తించాం. అందుకు అనుగుణంగా ఎత్తైన వంతెనల ఏర్పాటుకు ప్రతి పాదనలు సిద్ధం చేశాం. నిధులు, ప్రభుత్వం అనుమతులు రాగానే నిర్మాణ పనులకు చర్యలు చేపడతాం. – ఆర్‌అండ్‌బీ ఏఈబ్ల్యూఈ మనోహర్, నందికొట్కూరు

డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ వై.జిష్ణునాగవిజయ్ శుక్రవారం తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఈనెల 9వ తేదీలోపు కళాశాలలో సంప్రదించాలన్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు స్టడీ సర్టిఫికెట్లతోపాటు పది, ఇంటర్మీడియెట్ మార్కుల మెమోలు, విద్యార్థి, తల్లి దండ్రుల ఆధార్‌కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, మూడు పాస్ పోర్టు సైజు ఫొటోలు కళాశాలలో అందజేయాలన్నారు.

నీలిషికారిపేటలో పోలీసుల దాడులు

- 50 లీటర్ల నాటు సారా స్వాధీనం, బైక్ సీజ్
- 1,500 లీటర్ల బెల్లం ఊట పారబోత

నందికొట్కూరు: పట్టణంలోని నీలిషికారిపేటలో శుక్రవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ చేపట్టారు. టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. సోదాల్లో 1,500 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి పారబోశారు. 50 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని, ఒక బైక్‌ను సీజ్ చేశారు. భారీ సారా తయారీ సామగ్రి, డ్రమ్ములు, బిందెలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నాటు సారా తయారు చేయడం నేరమన్నారు. సారా తయారు చేసినా.. విక్రయించినా.. ఇతర ప్రాంతాలకు తరలించినా క్రిమినల్ కేసులతో పాటు వాహనాలు సీజ్ చేసి జైల్‌కు పంపుతామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు తప్పవన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం

నందికొట్కూరు: మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్య అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశం భవనంలో విధాన్ సే సమాధాన్ లీగల్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. అమ్మాయిలు, అబ్బాయిలు అనే తేడా లేకుండా చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. మహిళల్లో ప్రశ్నించే తత్వం రావాలని ఆమె సూచించారు. అన్యాయాలు, దాడులు, దౌర్జన్యాలు జరిగిన వెంటనే పోలీసులను ఆశ్రయించాలన్నారు. అక్కడ న్యాయం జరగకపోతే స్వయంగా కోర్టును ఆశ్రయించవచ్చన్నారు. అనంతరం మహిళలకు విధాన్ సే సమాధాన్ లీగల్ కిట్లను జడ్జి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరిదేవి, న్యాయవాదులు వెంకటరమణ, మద్దయ్య పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్య

ఉచిత ఇసుక ఏది బాబూ



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: అధికారం చేపట్టి వందరోజులు అవుతున్నా పేదలకు ఉచిత ఇసుక సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు ఆరోపించారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ఉచిత ఇసుక అమలు చేయాలంటూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఉచితంగా ఇసుకను ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండానే కూటమి ప్రభుత్వం వందరోజుల సంబరాలు చేసుకుంటుండటం సిగ్గుచేటన్నారు. ఇసుక అందుబాటులో లేక ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయి లబ్ధిదారులు ఇబ్బంది పడుతుండగా, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేక పస్తులు ఉండాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ఉచిత ఇసుకను ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఎం నాయకులు ఫక్కీర్‌సాహెబ్, బాబు, ఉస్మాన్‌బాషా, ఈశ్వరమ్మ, హుసేన్, మధులత, గణేష్, ఈశ్వర్, ఎల్లయ్య, ఉస్మాన్, నరసింహ, సుబ్బయ్య, నాగలక్ష్మి, జయరాణి, రంగమ్మ పాల్గొన్నారు.

గిరిజన రైతులకు శిక్షణ

నందికొట్కూరు: గిరిజన రైతులకు శనగలో ఉప ప్రణాళిక కింద ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నంద్యాల శనగ శాస్త్రవేత్త(కీటక విభాగం) రామక్రిష్ణారావు అన్నారు. శుక్రవారం వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఆత్మ భవనంలో కోళ్లబావాపురం గ్రామానికి చెందిన గిరిజన రైతులకు అఖిల భారత శనగ సమన్వయ పథకం ఆధ్వర్యంలో శనగ ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఉప ప్రణాళిక ప్రాముఖ్యత అందరూ తెలుసుకోవాలన్నారు. ప్రదర్శన క్షేత్రాల నుంచి పంపిణీ చేసిన నంద్యాల గ్రామ్–857 రకం విశిష్టతను రైతులకు తెలియజేశారు. విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ సాధ్యమవుతుందని రైతులకు చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత నీలిమ, బీహెచ్ చైతన్య, ఏడీఏ విజయ శేఖర్, ఏఓ షేక్ షేక్షావలి పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

హామీని అమలు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.యేసురత్నం, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ రత్నరాధికకు వినతి పత్రం అందించారు. తాము అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పుడు అమలు చేయకుండా కాలయాపన చేయడం తగదన్నారు. ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులకు పనులు చిక్కడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఎం నాయకులు ఎ.సురేంద్ర, సద్దాం హుసేన్, నాగేశ్వరరావు, నాయకులు భాస్కర్, వీరన్న, కిరణ్, గణపతి, రాజేష్, మహమ్మద్, ముర్తుజా, షాకీర్, రవీంద్ర, హుసేన్, నూర్ పాల్గొన్నారు.

వెలుగోడు: ఉచిత ఇసుక హామీని అమలు చేకుండానే కూటమి ప్రభుత్వం వందరోజుల సంబరాలు చేసుకుంటుండటం సిగ్గుచేటని సీపీఎం నాయకులు మహమ్మద్ రఫీ, సీఐటీయూ మండల అధ్యక్షులు నాగమోహన్ విమర్శించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉచిత ఇసుక అమలు చేయాలని వారు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, రామకృష్ణ, జి.బాషా, రహంతుల్లా, ఎర్ర బాషా, కిషోర్, కరిముల్లా, కృష్ణ, నాగమోహన్ పాల్గొన్నారు.

పొదుపు మహిళల అభిమానం వెలకట్టలేనిది



బదిలీపై వెళ్తున్న వెలుగు డీఆర్‌డీఏ సిబ్బందిని సన్మానిస్తున్న పొదుపు మహిళలు, సీసీలు

పగిడ్యాల: స్వయం సహాయక పొదుపు మహిళల అభిమానం వెలకట్టలేనిదని వెలుగు డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డినేటర్ డేగలయ్య, ఏపీఎం శ్రీనివాసులు, స్త్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. బదిలీపై వెళ్తున్న డేగలయ్య, శ్రీనివాసులు, శ్రీనివాసరావులను శుక్రవారం వెలుగు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. వారి స్థానాల్లో బదిలీపై వచ్చిన ఏపీఎం కళావతి, సీసీ నాగేశ్వరరావులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు విజయమ్మ, ఇన్‌చార్జ్ ఏరియా కో ఆర్డినేటర్ అంబమ్మ, మిడుతూరు, జూపాడుబంగ్లా, నందికొట్కూరు, మండలాల ఏపీఎంలు సుబ్బయ్య, శ్రీనివాసులు, సీసీలు రమణయ్య, పల్లె గాంధీ, క్రిష్ణారెడ్డి, నాగేశ్వరరావు, కర్రెన్న, నాగన్న, ఉమామహేశ్వరి, జంగిలయ్య, మండల సమాఖ్య కార్యదర్శి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: బదిలీపై వెళ్లిన డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీరంగారెడ్డిలను తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది సన్మానించారు. కాగా ఇక్కడికి బదిలీపై చ్చిన డీటీ సత్యదీప్, ఆర్ఐ సాయినాథ్‌రావు డిప్యుటేషన్‌పై కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు.

ప్రజలను చైతన్యం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి



శిల్పాచక్రపాణిరెడ్డి

బండిఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక పాలనను ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రజలను చైతన్యం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన నంద్యాలలోని పద్మావతి నగర్‌లో ఉన్న తన కార్యాలయంలో బండిఆత్మకూరు మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు ఖండించి నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వంద రోజుల పాలనకే ప్రజలు విసుగు చెందారని, ఈ ప్రభుత్వం ఎంతో కాలం ఉండదన్నారు. ప్రజలే బుద్ధి చెప్పి సాగనంపుతారని, అంతవరకు అధైర్య పడకుండా ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ నాయకుడు భువనేశ్వర్ రెడ్డి, బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవ రెడ్డి, వైస్ ఎంపీపీ రాగల రమణ, నాయకులు పల్లె మహేందర్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, బూరుగయ్య, ఓబుళ రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.



నందికొట్కూరు: గాయత్రీ దేవి అలంకారంలో అమ్మవారు



జూపాడుబంగ్లా: గాయత్రీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ఆత్మకూరు: గాయత్రీదేవి అలంకరణలో చౌడేశ్వరిదేవి



వెలుగోడు: గజలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు

గాయత్రీమాతా..నమోస్తుతే!

శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో దసరా శరన్నవరాత్రోత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండో రోజు వేద పండితులు, పురోహితులు, అర్చకులు అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉదయమే పుణ్య స్నానాలు ఆచరించి ఆలయాలకు చేరుకుని అమ్మవార్లకు పుష్పార్చాన, కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించుకున్నారు. పలు చోట్ల నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



కొత్తపల్లి: కొలనుభారతిదేవి ఆలయంలో గాయత్రీ దేవిగా దర్శనం



మిడుతూరు: బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో అమ్మవారు



పాములపాడు: బాలత్రిపుర సుందరీదేవి రూపంలో భక్తులను కరుణించిన అమ్మవారు



నందికొట్కూరు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం



మిడుతూరు ఎంపీడీఓ దశరథరామయ్య



వెలుగోడు ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి



బండిఆత్మకూరు ఎంపీడీఓ దస్తగిరి

బాధ్యతల స్వీకరణ

సాధారణ బదిలీల్లో భాగంగా పలువురు ఎంపీడీఓలకు స్థాన చలనం కలిగింది. శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లోని మండల స్థాయి అధికారులను కొందరిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో వారు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నందికొట్కూరు ఎంపీడీఓగా సుబ్రహ్మణ్యం, మిడుతూరు ఎంపీడీఓగా దశరథరామయ్య, వెలుగోడు ఎంపీడీఓగా మధుసూదన్ రెడ్డి, బండిఆత్మకూరు ఎంపీడీఓగా దస్తగిరి, ఆత్మకూరు ఎంపీడీఓగా కె.వి.సుబ్రహ్మణ్యంశెట్టి, పాములపాడు ఎంపీడీఓ చంద్రశేఖర్, జూపాడుబంగ్లా ఎంపీడీఓగా గోపీకృష్ణ బాధ్యతలు చేపట్టడంతో వారిని అధికారులు, కార్యాలయాల సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. – సాక్షి, నెట్‌వర్క్

టమాట..100

జూపాడుబంగ్లా: మండలకేంద్రంలో శుక్రవారం వారాంతపు సంతలో కిలో టమాట రూ.100 పలికింది. నాలుగు మాసాల నుంచి టమట ధరలు ఆకాశాన్నంటుతుండటంతో వినియోగదారులు సతమతం అవుతున్నారు. కిలో కొనేవారు అర కిలోతో సరిపెట్టుకుంటున్నారు. చిక్కుడు, ఆలు, క్యాబేజీ, క్యారెట్ తదితర కూరగాయలు కూడా కిలో రూ.60లు పలకాయి.

మద్యం బాటిళ్ల స్వాధీనం

మిడుతూరు: మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బైరాపురం గ్రామంలో మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో ఏఎస్ఐ సుబ్బయ్య శుక్రవారం సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. బోయ రంగమ్మ ఇంట్లో 10 మద్యం బాటిళ్ల గుర్తించి స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

గోకులంలో గ్రాస సమర్పణకు ఏర్పాట్లు



గోశాల వద్ద పరిశీలిస్తున్న ఈఓ పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని హేమారెడ్డి, మల్లమ్మ మందిరం ఎదురుగా దాతల సహకారంతో నిర్మించిన గోకులంలో గోవులకు భక్తులు గ్రాసాన్ని సమర్పించే కార్యక్రమాన్ని శుక్రవారం దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు ప్రారంభించారు. గోకులంలో భక్తులు సౌకర్యవంతంగా గోవుకు గ్రాసాన్ని సమర్పించే ఏర్పాటు చేయాలని ఈఓ సిబ్బందికి సూచించారు. మందిరం ముందుభాగంలో మరిన్ని దేవతా వృక్షాలను నాటాలని, ముఖమండపంలోకి ప్రవేశించి, వెలుపలికి వచ్చే మెట్ల మార్గంలో షెడ్డు నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.నరసింహారెడ్డి, డీఈఈ చంద్రశేఖరశాస్త్రి, సుబ్బారెడ్డి, గోశాల పర్యవేక్షకులు జి.రవి, ఉద్యానవన అధికారి జి.ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.